

రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 28 జులై, 2026 | పేజీలు :08



# ఎల్‌నినోతో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎల్‌నినో నేపథ్యంలో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టేలా వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, సంబంధిత అధికారులతో నిర్వహించిన ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎల్‌నినో ప్రభావంపై సమీక్ష సమావేశంలో జిల్లాలో ఖరీఫ్ సాగు పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, ఫార్మ్ పాండ్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున కందులు, పెసలు, మినుములు, నువ్వులు, పొద్దుతిరుగుడు, ఆయిల్ పామ్ వంటి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని, పొలాలను బీడుగా ఉంచకుండా సాగు చేయడం ద్వారా రైతులు ఆదాయం పొందడంతో పాటు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా కొనసాగుతాయని, రాబోయే పది రోజులను ప్రత్యేక కార్యాచరణగా తీసుకొని గ్రామాల వారీగా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని, ప్రతిరోజూ ఎంతమంది రైతులు పంట మార్పిడికి ముందుకొచ్చారో నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల మార్పిడి ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను సాధించాలని, జిల్లాలో ఒంటరి మహిళా రైతులు, చిన్న, సన్నకారు రైతులకు ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుకు జిల్లా యంత్రాంగం ద్వారా అదనపు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 2.91 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని, రైతులు భూములను సాగు చేయకుండా ఖాళీగా ఉంచితే రైతు భరోసా వంటి ప్రభుత్వ ప్రయోజనాలను కోల్పోయే అవకాశం ఉందని పేర్కొంటూ ప్రతి ఎకరా సాగులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ జలాల మట్టాలను పెంపొందించేందుకు ఫార్మ్ పాండ్ల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఫార్మ్ పాండ్ల నిర్మాణానికి సంబంధించిన చెల్లింపులను 15 రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు తమ పొలాల్లో ఫార్మ్ పాండ్లు నిర్మించుకునేలా ప్రత్యేకంగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



# పూరిగుడిసెల్లో నివసిస్తున్న వారి వివరాలు పక్కాగా సేకరించండి

### అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోండి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీడం గంగారాం, జడ్పీ డిప్యూటీ సీఈవో పవన్ కుమార్‌తో పాటు సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పూరిగుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల వివరాలను గ్రామాల వారీగా పకడ్బందీగా సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను ఎంపీడీవోల సమన్వయంతో పూర్తి చేయాలని, గృహ నిర్మాణ శాఖ, జిల్లా పరిషత్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని, వివిధ దశల్లో ఉన్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్లను రద్దు చేయాలని కోరుతున్న లబ్ధిదారుల వివరాలను ప్రత్యేకంగా సేకరించాలని, అలాగే సాంకేతిక సమస్యల కారణంగా ఎల్–3 జాబితాలో నమోదైన అర్హులైన లబ్ధిదారులను పరిశీలించి ఎల్–1 జాబితాలోకి మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా, మొదటి విడతలో ఇళ్లు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల వివరాలను సేకరించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యసాధనలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి పథకం విజయవంతం కావడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు.

# ప్రజావాణికి 162 దరఖాస్తులు

### అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజావాణికి 162 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 162 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందించి.. పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

**ఆర్డీఓ కార్యాలయాల్లో..** సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో

తరువాయి 2లో

# బ్రిడ్జి నిర్మాణంలో జీవన్‌రెడ్డి నిజాలు తెలుసుకొని మాట్లాడాలి



### ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల మోతే రోడ్డు పార్టీ కార్యాలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ సోమవారం మీడియా సమావేశంలో నిర్వహించారు. ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్‌ను హైదరాబాద్‌లో కలిసి బోర్నపల్లి జగన్నాథ్‌పూర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో వినతిపత్రాన్ని అందజేయడం పట్ల జీవన్ రెడ్డి గారి వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. కేంద్ర మంత్రి జువెల్ ఓరం రాయికల్‌లో జగన్నాథ్ పూర్ బ్రిడ్జి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని వారిని ఎంపీ అరవింద్‌తో ఢిల్లీలో కలిసి వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఎస్టీ వెల్ఫేర్ శాఖ వారి వద్ద ఉండడంతో

తరువాయి 2లో

## ప్రజావాణికి 162 దరఖాస్తులు

(మొదటిపేజీ తరువాయి)

7 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 1 దరఖాస్తు రాగా, సంబంధిత శాఖ అధికారికి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు పాల్గొన్నారు.

## నిజాలు తెలుసుకొని మాట్లాడాలి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కోరగా నా సూచన మేరకు కేంద్రానికి జగన్నాథ్ పూర్ బ్రిడ్జి ప్రతిపాదనలు పంపడం జరిగిందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మంత్రి అయ్యాక బొర్నపల్లి జగన్నాథపూర్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేశారని, తొలి సంతకం చేశారని, టెండర్ వేసిన కాంట్రాక్టర్లు పని చేయక పోవడం వల్ల మరల టెండర్ ప్రక్రియ చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని త్వరిత గతిన పనులు పూర్తికి కృషి చేయాలని రాష్ట సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్‌ను వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగిందని అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ వాణి శ్రీనివాస్, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, ఎఎంసి చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, బండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, రాయికల్ మండల అధ్యక్షులు రవీందర్ రావు, నాయకులు కోల శ్రీనివాస్, పాదం రాజు, సురేందర్ నాయక్, ప్రసాద్, మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్,సర్పంచుల ఫోరం బొలిశెట్టి గంగారెడ్డి, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** పేద ప్రజలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ విధానానికి నిదర్శనమని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు అన్నారు. సోమవారం మెట్‌పల్లిలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం రూ. 6.25 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఖుతుబోదీన్ పాషా, టీపీసీసీ ఫిషర్ మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొడిమ్యల దీపక్ రాజ్, ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్, ఇబ్రహీంపట్నం మండల ఫిషర్‌మెన్ అధ్యక్షుడు మగ్గిడి నందం, కల్లెడ గంగాధర్, మహబూబ్ ఖాన్, బైండ్ల శ్రీకాంత్, చిలువేరి గంగాధర్, ఎట్టేం మల్లేష్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.

# ముంపు పేరుతో మమ్మల్ని రెండుగా విడగొట్టొద్దు

### ఒకే గ్రామంగా ఉంచి అందరికీ న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలం నారాయణపూర్ చెరువు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తమ గ్రామాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ నారాయణపూర్, ఇస్తారుపల్లె వాసులు భారీ ఆందోళన నిర్వహించారు. సోమవారం మధురానగర్ గ్రామ పంచాయతీ నుంచి నారాయణపూర్ గ్రామం వరకు శాంతి యుత ర్యాలీ నిర్వహించి అనంతరం జగిత్యాల కరీంనగర్ ప్రధాన రహదారిపై చేరుకుని సుమారు 15 నిమిషాల పాటు శాంతియుతంగా ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రాజెక్టు కట్ట నిర్మాణంలో భాగంగా గ్రామాన్ని సగానికి విడగొట్టి కొందరికి మాత్రమే పరిహారాన్ని పరిమితం చేయడం దారుణమన్నారు. మమ్మల్ని రెండుగా విడగొట్టొద్దని గ్రామాన్ని ఒకే యూనిట్‌గా ఉంచి అందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేవలం కొందరి ఇళ్లను మాత్రమే ముంపు పరిధిలోకి తీసుకొచ్చి మిగతావారిని వదిలేయడం వల్ల గ్రామంలో విభేదాలు తలెత్తుతున్నాయని తెలిపారు. తాము చేసే త్యాగం వల్ల ఇతర గ్రామాలకు వేలాది ఎకరాలకు సాగు నీరు అందుతుంది కానీ తమను మాత్రం నీటిలో ముంచేసే పరిస్థితి తేవడం దారుణమని నిలదీశారు. ప్రాజెక్టు వల్ల భవిష్యత్‌లో మిగతా ఇళ్లకు కూడా ప్రమాదం ఉంటుందని అందుకే అరకొరగా కాకుండా సమగ్రంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. నారాయణపూర్, ఇస్తారుపల్లె గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించి బాధితులకు సరైన పునరావాసం, నష్ట పరిహారం కల్పించిన తర్వాతే పనులు ప్రారంభించాలని పట్టుబట్టారు. ధర్నా కారణంగా కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా పోలీసులు నచ్చజెప్పడంతో గ్రామస్థులు శాంతించారు. అనంతరం తహసీల్దార్ అంబటి కవితకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం తీసుకున్న తహసీల్దార్ రజిత మాట్లాడుతూ నారాయణపూర్ గ్రామంలో ప్రస్తుతం ప్రాజెక్టు అలైన్‌మెంట్ ప్రకారం కేవలం కొన్ని ఇళ్లను మాత్రమే ల్యాండ్ అక్విజిషన్ పరిధిలోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. అయితే గ్రామాన్ని ముక్కలుగా చేయకుండా ఇస్తారుపల్లె గ్రామానికి కూడా న్యాయం చేయాలని స్థానికులు కోరినట్లు పేర్కొన్నారని వినతిపత్రంలోని ప్రతి అంశాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో ముంపు బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి



జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం పోలాస గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పోలాస రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పాల్గొని ఎలనీనో ప్రభావం వల్ల వరి సాగుకు ప్రత్యామ్నాయ పంటల వేసేందుకు నాణ్యమైన విత్తనాల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎలనీనో వల్ల వర్షాలు లేవు, ప్రాజెక్టులో నీళ్ళు లేక విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని, రైతులు సాగునీరు పొదుపుగా వాడాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. భవిష్యత్తులో తీవ్ర నీటి కరువు రానుందని, ఆరుతడి పంటలు వైపు రైతులు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే తెలిపారు. డ్రిప్, ఎయిర్ డ్రిప్, ఎయిర్‌గన్‌లను రైతులు వాడాలని అన్నారు. రైతులు కరువు ఉందని పొలం వేసి మిగతా భూమి బీడు ఉంచకుండా ఆరుతడి పంటలు కంది, పెసర, మినుము, మొక్క జొన్న, బంతి, కూరగాయలు పండించాలని ఎమ్మెల్యే అన్నారు. రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు పాటించాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గజంగి నందయ్య, డీఓఎ భాస్కర్,ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, ఎఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, హార్టీకల్చర్ అధికారి లత, వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయ భాస్కర్, కిషోర్, సర్పంచ్ మిల్కురి శంకరయ్య, రూరల్ ఎంఆర్ఓ హకీమ్, ఎడిఎ తిరుపతి నాయక్, పాక్స్ చైర్మెన్ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కోల శ్రీనివాస్, జిల్లా సర్పంచుల ఫోరం గంగారెడ్డి, ఎఎంసి డైరెక్టర్ జయరాం, సురేష్, శ్రీకాంత్, మాజీ సర్పంచ్ చీర్ర నరేష్, ఆలయ చైర్మెన్ భూమన్న, సర్పంచులు, రైతులు,నాయకులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**పరజాపక్షం/కరీంనగర్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 250 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**నగరపాలక సంస్థ ప్రజావాణిలో..**

కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రజావాణిలో నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ ఆయాజ్, డిప్యూటీ కమీషనర్ ఖాధర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమీషనర్ రాజమనోహర్ నగరంలోని పలు డివిజన్లకు చెందిన ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. నగరపాలక సంస్థలో గల ఇంజనీరింగ్ 5, టౌన్ ప్లానింగ్ 11, రెవెన్యూ 1, సానిటేషన్ 3, ఇందిరమ్మ 1 చొప్పున మొత్తం 21దరఖాస్తులు రావడం జరిగింది. ఇందులో ప్రధానంగా టౌన్ ప్లానింగ్ విభాగం నుండి ఆక్రమణల తొలగింపు, అనాథరైజ్డ్ కన్‌స్ట్రక్షన్స్, ఇల్లీగల్ కన్‌స్ట్రక్షన్స్ సమస్యలు, రెవెన్యూ విభాగం నుండి టాక్స్ రివిజన్, న్యూ ప్రాపర్టీ, నల్లా కనెక్షన్, వాటర్ సమస్య, ఇందిరమ్మ తదితర సంబంధించి అంశాల పరిష్కారంపై ఆర్జీలు రావడం జరిగింది. ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి పరిష్కరించేలా చర్యలు తీస్కోవాలని సెక్షన్ల వారిగా అధికారులకు ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. డిసిపి బషీరొద్దిన్, సూపరింటెండెంట్లు షాహిదా పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి భూమి పూజ చేశారు. సోమవారం కొత్తపల్లి మండలంలోని రేకుర్తి 19వ డివిజన్‌లో గల రేకుర్తి చౌరస్తా వద్ద 15వ ఫైనాన్స్ కమీషన్ నిధులు సుమారు రూ.20 లక్షల రూపాయలను వెచ్చించి త్రాగునీటి పైప్ లైన్ నిర్మాణం కోసం పూజ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు, కార్పోరేటర్ సుధగోని మాధవి కృష్ణ, తుల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలు పరిష్కారం చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ బి.శ్రీరాములతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. రామగుండం నగరానికి చెందిన సాదు సత్తెమ్మ తనకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల గోదావరిఖనిలో ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు రాస్తూ పరిశీలించి అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీకి చెందిన జి.మల్లేశం హన్మండ్లపల్లి గ్రామం సర్వే నెంబర్ 77ఇ లో 2 ఎకరాలు 28 గుంటల భూమి తాతల నుంచి వస్తుందని దాని వారసత్వ హక్కుదారులకు పట్టా పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ సుల్తానాబాద్‌కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యతగా విద్యాకేంద్రాలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆధునిక బోధనా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల (అమర్ నగర్)లో రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి, తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర సేవా శిక్షణ కార్యక్రమంను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న రోబోటిక్స్ ఇన్ అకాడమిక్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాల ద్వారా ప్రధానోపాధ్యాయులు విద్యా నాయకత్వం, విద్యార్థుల అభ్యసన ఫలితాల మెరుగుదల, డిజిటల్ లిటరసీ, కృత్రిమ మేధస్సు (ఏ ఐ), వినూత్న బోధనా పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు, SCERT వనరుల వ్యక్తులు, మాస్టర్ ట్రైనర్లు, మండల విద్యాధికారులు, శిక్షణలో పాల్గొంటున్న ప్రధానోపాధ్యాయులను జిల్లా కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ. శారద, షేక్, విద్యాశాఖ అధికారులు,SCERT ప్రతినిధులు, మాస్టర్ ట్రైనర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు ముమ్మరం

### మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ సోమవారం పట్టణంలోని 5వ, 18వ వార్డుల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాన డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. వార్డులలో రోడ్లపై ఉన్న చెత్తను ఆటోల ద్వారా సకాలంలో తరలించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, యాంటీ లార్వా స్ప్రే కార్యక్రమాలను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే దోమల నివారణ చర్యలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. 18వ వార్డు కౌన్సిలర్ చెట్లపల్లి మీనా సుఖేందర్ గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ముజీబ్ పాటు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కుబీర్ ఎంఇఓ, హెచ్‌ఎం నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కుబీర్ మండలంలోని అంతర్నీ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం సుభాష్‌తో పాటు, ఆయనపై వచ్చిన ఆరోపణలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న మండల విద్యాధికారి విజయ్ కుమార్‌పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని చాత్ర యువ సంఘర్షణ సమితి నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగి అయిన హెచ్ ఎం సుభాష్ రాజకీయ కార్యకలాపాలకు సన్నిహితంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై పాత్రికేయులు, విద్యార్థి సంఘాలు, సామాజికవేత్తలు పలుమార్లు ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఎంఈఓగానీ, డీఈఓగానీ కఠిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వివాదాస్పద హెచ్ఎం సుభాష్‌తో పాటు ఆయనకు సహకరిస్తున్న ఎంఈఓ విజయ్ కుమార్‌పై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షతో పాటు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విజ్డమ్ విద్యార్థులు

**ప్రజాపక్షం/రాయికల్ :** తెలంగాణ రాష్ట్ర నేషనల్ జావేలిన్ డే సెలబ్రేషన్స్, మొదటి తెలంగాణ కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో భాగంగా జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివేకానంద మినీ స్టేడియం జగిత్యాలలో శుక్రవారం నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో విస్డం హైస్కూల్ రాయికల్ కు చెందిన క్రీడాకారులు U/6 విభాగంలో పెద్దిరెడ్డి ఆరుష్ 60 మీ రన్నింగ్ గోల్డ్ మెడల్, స్టాండింగ్ లాంగ్ జంప్‌లో సిల్వర్,150 మీ పరుగులో బ్రాంజ్ మెడల్,చొప్పరి రిహాన్ 60 మీ రన్నింగ్‌లో సిల్వర్ మెడల్, మరియు U/8 విభాగం స్టాండింగ్ లాంగ్ జంప్ లో సింగినేని దేవాన్ష్ సిల్వర్ మెడల్,200 మీ రన్నింగ్‌లో మ్యానం సాయిచరణ్ బ్రాంజ్ మెడల్, U/10 విభాగంలో తురగ స్వాద్వి స్టాండింగ్ లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్, 300 మీ రన్నింగ్‌లో సిల్వర్ మెడల్, U/12 విభాగంలో కోమటిరెడ్డి నివేదిత 400 మీ రన్నింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన తురగ స్వాద్వి, పెద్దిరెడ్డి ఆరుష్ లు ఆగష్టు 7 వ తేదీన జె. ఎన్ స్టేడియం హన్మకొండలో జరగబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు.ఇంతటి ఘన విజయాలు నమోదు చేసిన విద్యార్థులను విస్డం హై స్కూల్ కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి మెడల్స్ తో అభినందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నివేదిత రెడ్డి,పీఈటీలు రవిష్ రెడ్డి ,సునీత, తదితరులు పాల్గొన్నారు.



## యండి జాఫర్‌ను ఘనంగా సన్మానించిన కల్వకుంట్ల సుజిత్ రావు

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యదర్శిగా నియమితులైన యండి జాఫర్ను సోమవారం మెట్‌పల్లిలోని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు నివాసంలో సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా సుజిత్ రావు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు సమన్వయంతో పని చేయాలని, నూతన బాధ్యతల్లో యండి జాఫర్ విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి,టీపీసీసీ ఫిషర్‌మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మల్లాపూర్ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి,జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చెరుకు సమ్మయ్య,మహబూబ్ ఖాన్, అశోక్ యాదవ్,దామ రాజేష్, బైండ్ల శ్రీకాంత్, మొగిలి రాజేందర్,చిలువేరి గంగాధర్తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## ఖాతాదారులకు మెరుగైన సౌకర్యం కల్పించాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మల్లాపూర్ యూనియన్ బ్యాంకు నందు ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మల్లాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు అన్నారు. బ్యాంకు నందు కౌంటర్లలో హిందీ భాష మాట్లాడుతుండడంతో ఖాతాదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తెలుగు భాష మాట్లాడే సిబ్బందినీ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందనీ బ్యాంక్ మేనేజర్ వినతి పత్రం అందించారు. పాల్గొన్న వారిలో సర్పంచ్ లక్ష్మణ్, వార్డు సభ్యులు ముష్కరి రమేష్, షబ్బీర్, లత, లక్ష్మి , పాల్గొన్నారు.

## నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో వినతి

**ప్రజాపక్షం /రాయికల్ :** రాయికల్ మండల వ్యాప్తంగా విలేకరులం అని చెప్పుకుంటు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న నకిలీ పాత్రికేయులపై తగు చర్యలు కోరుతు ప్రెస్‌క్లబ్ [జాక్] ఆధ్వర్యంలో సోమవారం ఎఎస్ఐకి పిర్యాదు చేశారు. ఈ సందర్బంగా అధ్యక్షులు, చింతకుంట సాయి కుమార్, ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య, కోశాధికారి కడకుంట్ల జగదీశ్వర్‌లు మాట్లాడుతూ ఇటీవల కొందరు వ్యక్తులు ఎలాంటి జర్నలిస్ట్ యూనియన్‌ల సభ్యత్వం మరియు,మా ప్రెస్‌క్లబ్ [జె ,ఎ ,సి]లో సభ్యత్వం లేకుండా వాహనాలకు ప్రెస్ స్టికర్‌లు వేసుకుని కనీస విద్యార్హత, అవగాహన లేకుండా విలేకరులం అని చెప్పుకుంటూ చలామణి అవుతూ ప్రజలకు తప్పుదోవ పట్టించి పలు గ్రామాలలో అసాంఘిక చర్యలకు దిగుతు ఇష్టారాజ్యంగా అనేక వాహనాలు ఆపుతూ ప్రెస్ పేరుతో బెదిరింపులకు దిగడమే కాకుండా పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్నారని, సివిల్ తగాదాలలో కలగ చేసుకుంటున్నారని మరియు అధికారులను పలుమార్లు బెదిరించడమే కాకుండా అక్రమ వసూళ్లకు దిగుతూ చిల్లర వ్యవహారాలలో కలగచేసుకుంటూ వాస్తవికంగా పాత్రికేయులం అయిన పాత్రికేయ విలువలను నాశనం చేస్తు మా మనుగడకు ప్రమాదంగా మారుతున్నారని, దాంతో పాటు ఇతర ప్రాంతాలనుండి వచ్చి వారు ఇదే రీతిన విలేఖరులుగా వ్యవహరిస్తున్నారని మా అస్తిత్వానికి ఇబ్బందిగా మారిన నకిలీ జర్నలిస్టులను గుర్తించి తగు చర్యలు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్‌లు నాగమల్ల శ్రీకర్, ఎండి ముజఫర్ మాజీ అధ్యక్షులు వాసరి రవి, గౌరవ అధ్యక్షులు సయ్యద్ రసూల్ ,ఉపాధ్యక్షులు సింగని శ్యామ్ సుందర్, యాచమనేని కిరణ్ రావు,వాసం లింబాద్రి, గంగాధర సురేష్, ఇమ్మడి విజయ్ కుమార్ ఎద్దండి జితెందర్, అనుపురం లింబాద్రి గౌడ్, గన్నవరం గంగాధర్, కోమటి రెడ్డి కిష్టారెడ్డి, చెలిమెల మల్లేశం, పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు మాజీమంత్రి ఈశ్వర్ పరామర్శ

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు.మండలంలోని రాపల్లి గ్రామంలో ఓకే కుటుంబానికి చెందిన మారంపెల్లి పవన్ కళ్యాణ్ ,కల్లపెల్లి హరీష్ ,కల్ల పెల్లి గౌతమి ఇటీవలే అకాల మరణం చెందడం తో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యర్థం చేశారు.అనంతరం అదే గ్రామానికి చెందిన గజ్జెల దుబ్బయ్య మృతి చెందడంతో నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.తదుపరి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంగుల సత్తయ్య రాజవీరు ఇటీవలే అనారోగ్యం కారణంగా మరణించడం వలన వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు గోస్కుల జలంధర్,మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం,కాంపల్లి హనామ్రండ్లు, గందె వెంకట మాధవరావు,నల్ల శ్యామ్, మారంపల్లి బాబు ,కనుకుట్ల లింగారెడ్డి,మాజీ సర్పంచ్‌లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సోమేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఎత్తైన కొండపై వెలసి విరజిల్లుతున్న శ్రీ కనకసోమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు పంచామృతాలతో అభిషేక అర్చనలు జరిపించారు.కాలినడకన కొండపైకి చేరుకుని పవిత్ర కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి మొక్కులను చెల్లించుకొని వేడుకున్నారు.సుమారు 200 పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకోగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో మూడు రోజుల విత్తన మేళా

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29 వరకు విత్తన మేళా నిర్వహిస్తున్నామని మండలవ్యవసాయ అధికారి ఆకు రాజకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కందులు,మొక్కజొన్న,మినుములు,పెసర్లు, నువ్వులు,కూరగాయల విత్తనాలు,నానో యూరియా, నానో డీఏపీ అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి ఆకు రాజ్ కుమార్ పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోరిగం రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ జిల్లాల పవన్,సర్పంచ్ బద్దం గోపి,ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్,వ్యవసాయ విస్తరణ అధికారులు,విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.



## ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

### మెట్పల్లి డీఎస్పీ ఏ. రాములు

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** వార్షిక తనిఖీలో భాగంగా మెట్‌పల్లి డీఎస్పీ ఏ. రాములు సోమవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు,పరిసరాలను పరిశీలించి ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని,రౌడీషీటర్లు,సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం నిఘా ఉంచి శాంతిభద్రతలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ బి. సురేష్ బాబు,స్థానిక ఎస్సై జి. నవీన్ కుమార్,మల్లాపూర్ ఎస్సై ఏ.అనిల్,స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండో విడత ఉపాధ్యాయుల అంతర్గత శిక్షణ ప్రారంభం



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత మూడు రోజుల ఉపాధ్యాయుల అంతర్గత శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి బండారి మధు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రెమిడియల్ తరగతులను సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై శిక్షణ పొందాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు శ్రీధర్, వెంకటేశ్వరరావు, రఘునాథ్, వేణుగోపాల్, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ పాల్గొన్నారు.

# రైతులు పడుతున్న ఇబ్బందులుపై ప్రభుత్వం స్పందించాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** వాతావరణ మార్పులతో వర్షాలు కురువక వేసిన పంటలు కాపాడుకుందాం అంటే విద్యుత్ సమయానికి అందకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారతీయ కిసాన్ సంగ్ మండల అధ్యక్షుడు కళ్లెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ప్రతినెల సోమవారం రోజున భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా రైతులతో నిర్వహించే కార్యక్రమాన్ని చేపట్టారు. వర్షాలు పడకపోవడంతో పండించిన పంటలు కాపాడుకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు అనేకమని, రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించాలని, సకాలంలో ఎరువులు అందడం లేదని రైతులు పడుతున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు చిట్యాల లక్ష్మణ్ శ్రీనివాసరెడ్డి గంగారాజం,లక్ష్మి రెడ్డి,నుతి పెల్లి రాజం,ముష్కరి రమేష్,నాగరాజు రాజన్న,సోమారెడ్డి, కొండయ్య తదితరులు ఉన్నారు.

## ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

### వ్యవసాయ అధికారి రాజ్ కుమార్

**ప్రజాపక్షం/ధర్మపురి:** డీలర్లు డీఏపి ఎరువులను అధిక ధరలకు అమ్మినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మపురి మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలోని వివిధ ఎరువుల స్టాక్ తనిఖీ చేసి అవి అధీకృత సంస్థల నుండి వచ్చాయో లేదో పరిశీలించి వాటి రశీదులను ధృవీకరించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ డీలర్ తప్పనిసరిగా మండలానికి సరిపడా ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ముఖ్యంగా డిఏపి ఎరువులకు అధిక డిమాండ్ ఉన్నందున అధిక ధరలకు కాకుండా ఎమ్మార్పి ధరలకు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌లు, బిల్లు బుక్కులు రోజువారీగా ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. ప్రతీ దుకాణం ముందు ఎరువుల లభ్యత, ధరల పట్టిక బోర్డు ప్రదర్శించాలని తెలిపారు. అందరూ బుకింగ్ ఆప్ ద్వారా మాత్రమే యూరియా అమ్మకాలు జరపాలని డీలర్లకు సూచించారు.

## ఇపిఎఫ్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం / జమ్మికుంట:** మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ సప్లై సిబ్బంది, కార్యాలయ సిబ్బందికి ఈపీఎఫ్‌పై సోమవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపీఎఫ్‌లో ఉద్యోగి నుంచి 12 శాతం, యాజమాన్యం నుంచి 12 శాతం చొప్పున జమ అవుతుందని వివరించారు. ఈపీఎఫ్ సభ్యుడు మరణించినట్లయితే నామినీకి సుమారు రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు భీమా ప్రయోజనాలు లభించే అవకాశం ఉందని అర్హత మేరకు భార్యకు పెన్షన్, కూడా అందుతాయని తెలిపారు. ఈ సదస్సులో సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.రమేశ్, సీనియర్ అసిస్టెంట్, జి.అనిల్, జి.రాజిరెడ్డి మున్సిపల్ మేనేజర్, జి.రాజిరెడ్డి , శానిటరీ ఇన్స్‌పెక్టర్, ఐ రమేశ్, మున్సిపల్ కార్మికులు, వాటర్ సప్లై సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల గోడు పట్టించుకోని ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

కలెక్టరేట్ ముందు బీఆర్ఎస్ రైతు ధర్నా..

కలెక్టర్‌కు వినతిపత్రం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక,దుర్మార్గపు విధానాల వల్ల తెలంగాణలోని అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రైతు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు అందజేశారు.ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మళ్ళీ 2014 ముందునాటి దుస్థితిని తలపిస్తోందని విమర్శించారు. గత యాసంగితో పోలిస్తే ఎరువుల బస్తాల ధరలను ఒక్కోదానిపై రూ.350 నుండి రూ.600 వరకు అదనంగా పెంచి మార్కెట్లో విక్రయిస్తున్నా అధికారులకు, ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు.మరోవైపు అప్రకటిత కరెంట్ కోతలు, విపరీతమైన లోవోల్టేజ్ సమస్యల కారణంగా రైతుల మోటార్లు,ట్రాన్స్ఫార్మర్లు, స్టార్టర్లు కాలిపోయి వేల రూపాయల నష్టాన్ని చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై,బ్యారేజీలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయలేకనే కావాలనే కుట్రతో ప్రభుత్వం సాగునీటిని నిలిపివేసిందని ఆరోపించారు. కన్నేపల్లి పంప్‌హౌస్‌ను ఆన్ చేసి వెంటనే సాగునీరు ఇవ్వాలని గత నెల రోజులుగా రైతుల పక్షాన పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదని దుయ్యబట్టారు.రైతులకు ఇచ్చిన పంట పెట్టుబడి సాయం, బోనసులు, రుణమాఫీ వంటి హామీలను గాలికొదిలేసి, నేరుగా అన్నదాతల పొట్ట కొట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి ఎరువుల అదనపు ధరలను తగ్గించాలని,కరెంట్ కోతలను ఎత్తివేయాలని, వెంటనే సాగునీరు అందించి వ్యవసాయాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.లేనియెడల అన్నదాతల కడుపుమండి భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని,దానికి కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని దాసరి మనోహర్ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో విత్తన మేళా

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** రైతులు ఎలినినో ప్రభావం వల్ల ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని, భూగర్భ జలాలు కూడా తగ్గుతున్న బోరు బావుల కింద కూడా వరి పంట సాగు తగ్గించి ఆరుతడి పంటలకు సంబంధించిన విత్తనాలు, కందులు, నువ్వులు, మక్క, వేరుశనగ విత్తనాలు కొత్తపల్లి రైతు వేదికలో అందుబాటులో ఈనెల 27 నుంచి 29 వరకు ఉంటాయని వ్యవసాయ అధికారి సంతోష్ కుమార్ తెలిపారు. సోమవారం ప్రైవేట్ డీలర్స్, ఎఆర్ఎస్ కరీంనగర్ వారు విత్తనాలు అందుబాటులో ఉంచారని స్పష్టం చేశారు. ముఖ్యంగా కందులు, మక్కలు, మినుములు, వేరుశనగల విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌వికె కోఆర్డినేటర్ మధుకర్ రావు, కొత్తపల్లి ఏఈఓలు ఫజిల్, ఫరీద్, రాజశేఖర్, పద్మ, మండల రైతులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంను కలిసిన టీఎన్‌జీఓ నాయకుడు

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** టీఎన్‌జీవోస్ పెద్దపల్లి అర్బన్ జెంట్స్ కార్యదర్శిగా ఎన్నికైన గాండ్ల రమేష్ పటేల్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై త్వరగా స్పందించి పరిష్కరించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని రమేష్ తెలిపారు.తనను అర్బన్ జెంట్స్ కార్యదర్శిగా ఎన్నుకున్న తోటి ఉద్యోగులతో పాటు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్,నాయకులు సందీప్ రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, సహకరించిన ప్రతి ఒక్కరికీ గాండ్ల రమేష్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు వేదికలో ఘనంగా 'విత్తన మేళా'

**ప్రజాపక్షం/దిలావర్ పూర్ :** దిలావర్ పూర్ రైతు వేదిక ప్రాంగణంలో విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు రమణారెడ్డి, స్థానిక సర్పంచ్ అక్షర అనిల్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమణ సంయుక్తంగా ప్రారంభించారు.ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది సాధారణం కంటే 30 శాతం తక్కువ వర్షపాతం నమోదైనందున, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలోని ఒక రైతు వేదికలో ఈ విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులు, కెనాళ్ల కింద వరి సాగు ప్రశ్నార్థకంగా మారినందున రైతులు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. మినుము, పెసర, కంది, మొక్కజొన్నతో పాటు కూరగాయల సాగుపై దృష్టి సారించాలని కోరారు. అలాగే ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ సాగును రైతులు విరివిగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్ల ద్వారా రైతులకు అవసరమైన మినుము,పెసర, ఉంచారు.ఈ కార్యక్రమంలో మండల ఏఈఓలు జైపాల్, తేజస్విని, శ్రీనివాస్, హెచ్ఈఓ మౌనికలతో పాటు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును అమలు చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును అమలు చేయాలనిభారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు శనిగరపు తిరుమల, జిల్లా కార్యదర్శి ఆసాల రమలు అన్నారు. సోమవారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని,ప్రస్తుత జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, తరతరాలుగా మహిళలు తీవ్రమైన హింస అణచివేత లింగ వివక్షత కు గురవుతున్నారని,మహిళలు ఎన్నో పోరాటాలు కమ్యూనిస్టు పార్టీ నాయకుల బలిదానాలతో మహిళలకు కొన్ని చట్టాలు తీసుకొచ్చిన వాటిని పకడ్బందీగా అమలు చేయకుండా చట్టాలను నిర్వీర్యం చేస్తూ మహిళా హక్కులను నీరు గారుస్తున్నారని, సమాజంలో మహిళలు లేకుంటే సమాజ సృష్టి లేదని అలాంటి మహిళలకు నాటి నుండి నేటి వరకు పురుషాధిక్యా పెత్తనం తో మహిళ ల ఆత్మగౌరవం ఎవరో కల్పించే బిక్ష గా మారి పోయిందన్నారు. నేటి ఆధునిక సమాజంలో మహిళలపై కొత్త రకమైన హింస,దాడులు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలు పరంపర కొనసాగుతుందన్నారు. స్త్రీలను వ్యాపార పనిలో ఒక ఆట బొమ్మలుగా మారుస్తున్నారని మహిళలకు విద్య, వైద్యం, ఉపాధి,రాజకీయా రంగాలలో ప్రముఖ ప్రాధాన్యత కల్పించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళ వ్యతిరేక విధానాలపై పెద్దపల్లి జిల్లాలోని మహిళా లోకం ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యమ ఆందోళన లో మహిళలు పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేందుకు సిద్ధం కావాలని మహిళలకు పిలుపునిచ్చారు.

## అంధకారంలో జనగామ ప్రధాన రోడ్డు

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు

తొడుపునూరి రమేశ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ జనగామ ప్రధాన రోడ్డు కు లైట్లు ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ కార్పొరేషన్ మరియు సింగరేణి ఆర్జీ వన్ అధికారులను డిమాండ్ చేశారు. నవంబర్ 2025 లో ప్రధాన రోడ్డు వేసే సమయంలో రోడ్డు వెడల్పు కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ మరియు సోలార్ లైట్లను మున్సిపల్ కార్పొరేషన్ మరియు సింగరేణి సిబ్బంది తొలగించారని, నెలలు గడిచినా ఇంతవరకు ఇటు కార్పొరేషన్ అధికారులు,అటు సింగరేణి ఆర్జీ వన్ అధికారులు గానీ తిరిగి లైట్లు ఏర్పాటు చేయకపోవడం విచారకరం అని ఆయన అన్నారు. లైట్లు లేక చీకట్లో వెళ్ళేందుకు డివిజన్ ప్రజలు, వృద్ధులు , మహిళలు వివిధ అవసరాల కోసం గోదావరిఖని కి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.రాత్రి సమయంలో ప్రమాదాలు, దొంగతనాలు జరిగే అవకాశం కూడా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలయాపన చేయకుండా, తక్షణమే జనగామ ప్రధాన రోడ్డుకు సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.లేకుంటే ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

## జాతీయస్థాయిలో పారమిత విద్యార్థుల అద్భుత ప్రదర్శన



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కరీంనగర్ మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు జూలై 18 నుంచి 26 వరకు తిరుమల తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనలో అద్భుత ప్రతిభ కనబరిచి హనుమ అవార్డులు పొందారని పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. జూలై 18 నుంచి 26 వరకు భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక శాఖ అమరావతి, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన 26వ వార్షిక జాతీయ స్థాయి కూచిపూడి నాట్యంలో పారమిత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. పారమిత పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, అనుకర్ రావు, వినోద్ రావు, వియంయు ప్రసాద్, హనుమంత రావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత, ప్రసాద్, సమన్వయకర్తలు, నాట్య గురువు నాట్య సామ్రాట్ బొమ్మిడి నరేష్ కుమార్‌లు విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు.

## సుడా చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** శాతవాహన పట్టణ అభివృద్ధి సంస్థ (సుడా) అధ్యక్ష పదవిని ఈ విడత మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని మాదిగలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పదవిని వెలమ సామాజిక వర్గానికి కేటాయిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. సామాజిక సమీకరణల దృష్ట్యా ఈసారి సుడా చైర్మన్ పదవిని మాదిగలకు కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం మాజీ కన్వీనర్ కనకం విద్యాసాగర్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సముద్రాల లక్ష్మణ్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోస్కి శంకర్ లు మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి, పార్లమెంట్ ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గానికి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు అవకాశం కల్పించినా కాంగ్రెస్ ఈసారి అనాధిగా పార్టీ వెంటే ఉంటున్న మాదిగ సామాజిక వర్గాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పోస్టుల భర్తీలో మాదిగ సామాజిక వర్గానికి సముచిత ప్రాధాన్యత దక్కడం లేదని వారన్నారు. శాసనసభ ఎన్నికల ముందు పేర్కొన్న చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం సామాజిక న్యాయాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పదవిని ఆ సామాజిక వర్గానికి చెందిన ఆసంపల్లి శ్రీనివాస్ కు కేటాయించాలని వారు కోరారు. ఈ సమావేశంలో భీమ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ వాసాల శ్రీనివాస్, రావణ్, కొయ్యడ వినోద్, అనిల్, సురేష్, వాసాల మనోహర్, అనిల్, సతీష్, శంకరయ్య, కొమ్ము బాబు, మాతంగి విష్ణు, రాజు, కనకం కుమార్, గాలిపల్లి ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ అభయ హస్తం అమలు చేయాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని, లేనియెడల త్వరలో ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాదిగ శక్తి సంక్షేమ సంఘం మరియు భారత ఎరుకల అభివృద్ధి సంఘం నాయకులు హెచ్చరించారు.ఢిల్లీలోని జంతర్ మంథర్ వద్ద అంబేద్కర్ అభయ హస్తం సాధన కోసం నిర్వహించిన దళిత,గిరిజన ధర్నా కార్యక్రమంలో మాదిగ శక్తి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరి సురేందర్ సన్ని, భారత ఎరుకల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కండెల వెంకటేష్‌లు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వం ఏర్పడి కాలం గడుస్తున్నా ఇప్పటి వరకు అంబేద్కర్ అభయ హస్తం అమలు గురించి ఏ ఒక్క ప్రజా ప్రతినిధి కూడా మాట్లాడకపోగా, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ద్వారా గెలిచి మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న దళిత, గిరిజన ప్రతినిధులు ఢిల్లీలో ఈ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించామని,ఇప్పటికైనా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు పరచకుంటే ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పొన్నం సంతోష్, బుద్దె సాగర్, బొక్కు శ్రీనివాస్, మేరుగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

**ప్రజాపక్షం / జమ్మికుంట :** ప్రస్తుతం నెలకొన్న ఎల్నినో వాతవరణ పరిస్థితులకు అనుగునంగా మండలంలోని రైతాంగం ఆరుతడి పంటలకు మల్లాలని జమ్మికుంట మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ అన్నారు. మండలస్థాయిలో అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతు వేదికల్లో 27 నుంచి 29 వరకు రైతులకు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఈ సందర్భంగా జమ్మికుంట మండలంలోని ఆబాది జమ్మికుంట రైతు వేదికలో కంది, పెసర, మొక్కజొన్న, నువ్వులు, కూరగాయ విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. అందుబాటులో ఉన్న విత్తనాలే కాకుండా ఆముదం, వేరుశనగ, మినుములు మరే ఇతర పంటలను సాగు చేయదలచిన రైతులు ఆబాది జమ్మికుంట రైతు వేదికలో ఉన్న స్టాల్స్ యజమానికి గానీ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి గానీ తెలిపితే వాటిని సమకూర్చడానికి ప్రయత్నం చేయడం జరుగుతుందని తెలిపారు. పత్తి పంట బెట్ట పరిస్థితులకు లోనయినట్లయితే 1919 19 లేదా 13045 ఎరువులను ఎకరాకి ఒక కిలో చొప్పున నానో యూరియాతో కలుపుకొని పిచికారి చేయవచ్చని తద్వారా పంట బెట్టను తట్టుకుంటుందని పేర్కొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన బోయపోతు శ్రీనివాస్ ఇటీవలే అనారోగ్యం తో మృతి చెందడం తో వారి కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగా లేనందున రాఘవపట్నం గంగాదేవిపల్లె గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, యువకులు, ప్రజలు దయా హృదయం తో తోచిన విధంగా ఆర్థిక సహాయం చేసిన రూ. 57100 రూపాయలు,శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఆర్ జి పి సేవాసమితి ద్వారా అందచేయడం జరిగింది.మృతుని కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం అందించిన దాతలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్లు మాజీ ఉప సర్పంచ్ లు వోడ్నాల అంజయ్య, కాసాని చంద్రశేఖర్, కాళ్ళ రమేష్ (ఆర్ జి పి సేవా సమితి అడ్మిన్) తడవేణి రమేష్, బోయ పోతు అంజయ్య, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

# జెడ్పీ హైస్కూల్లో కిచెన్ షెడ్ ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/గంగాధర:** బూరుగుపలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లా లో సోమవారం గంగాధర మండల పరిషత్ అభివృద్ధి అధికారి దమ్మని రాము ఇటీవల నిర్మించిన కిచెన్ షెడ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలకు సంబంధించి అదనపు గదుల నిర్మాణం అలాగే ఇంకా కావలసిన టాయిలెట్స్ నిర్మాణం గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూలం కళ్యాణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఎలిగేటి మల్లికార్జున, గ్రామ కార్యదర్శి మమత, ఉపాధ్యాయులు నగేష్, విజయ్ కుమార్, లక్ష్మీ రాజు, జగదీశ్వర్ రెడ్డి, భూమయ్య, మల్లేశం, సత్యనారాయణ, శ్రీధర్, లచ్చయ్య, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు

# కొక్కెరకుంటలో పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్




**ప్రజాపక్షం/ రామడుగు:** రామడుగు మండలంలోని కొక్కెర కుంట గ్రామంలో శనివారం పోలీస్‌ల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ భద్రతా తనిఖీలు, అవగాహన సదస్సును నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే ధ్యేయంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు గ్రామంలో తనిఖీలు చేపట్టి, ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయకుమార్ మాట్లాడుతూ సమాజానికి పట్టిన మహమ్మారి లాంటి గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మి బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు పంచుకోవద్దని కోరారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. 50 ద్విచక్ర వాహనాలు సీజ్ తనిఖీల సమయంలో సరైన ధ్రువపత్రాలు (ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్) లేని 50 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి, సంబంధిత జరిమానా విధించిన తర్వాత హెచ్చరించి వాహనాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్, రామడుగు ఎస్సై రాజులతో పాటు దాదాపు 100 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపిటిసి,పలువురు నాయకులు




**ప్రజాపక్షం /మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీటీసీ కొల్లూరి గంగాధర్ బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధర మండల కేంద్రం ప్రజా కార్యాలయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు సుమారు 300 మంది నాయకులు, కార్యకర్తలు సోమవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కొల్లూరి గంగాధర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనను చూసి స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్న వారికి తగిన గుర్తింపు,గౌరవం ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్,జగిత్యాల జిల్ల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నక్క అనిల్ నూకపల్లి, రాంపూర్, గుడిపేట, మనాల, సర్వపూర్ ,సర్పంచులు, మిట్టి శ్రీను, బద్దం తిరుపతి రెడ్డి, అంజిరెడ్డి, మ్యాక లక్ష్మణ్, ఉపసర్పంచ్ కటకం వినయ్ వెల్మ కృష్ణారెడ్డి, శనిగరపు తిరుపతి నేరెళ్ల సతీష్ రెడ్డి,బండి రవి, బివి రమణ, నర్సింహా రెడ్డి కంటే అరుణ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు అండగా లయన్స్ క్లబ్



**ప్రజాపక్షం/రామగిరి :** విద్యార్థుల భవిష్యత్తుకు బాసటగా నిలుస్తూ లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో రామగిరి మండలంలోని నాగేపల్లి, రత్నాపూర్ గ్రామాల్లో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, ఆర్‌జీ–3 జనరల్ మేనేజర్ సుంకరి మధుసూదన్,లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ అధ్యక్షులు డా.శరణ్య మారుతి యాదవ్ విచ్చేసి విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించడం సమాజానికి చేసే గొప్ప సేవ అని పేర్కొన్నారు.విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ప్రకాశవంతమవుతుందని, విద్యార్థులను ప్రోత్సహించే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల్లో విద్యా పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు,వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ కార్యదర్శి, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కాటం సత్యం,పాస్ట్ ప్రెసిడెంట్లు మొల్మూరి శ్రీనివాస్, మేకల మారుతి యాదవ్, క్లబ్ డైరెక్టర్, లద్నాపూర్ సర్పంచ్ వనం రామచందర్ రావు, క్లబ్ చైర్ పర్సన్ కొప్పుల శ్రీపాద రావు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య, నాగేపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, ఎరుకల ఓదెలు, రామగిరి మండలం బీసీ సెల్ అధ్యక్షులు బండారి సదానందం, రామగిరి మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతుకూరి అవినాష్ ,నాగేపల్లి ఉప సర్పంచ్ సతీష్,కమాన్‌పూర్ వ్యవసాయ కమిటీ డైరెక్టర్ గుగులోత్ ప్రవీణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,గొల్లపల్లి రాయమల్లు,తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల సాగుతోనే అధిక లాభాలు : ఎఇఒ శశిధర్

**ప్రజాపక్షం/ముత్తారం :** కూరగాయల సాగుతోనే అధిక లాభాలు పొందవచ్చు అని మండల విస్తరణ అధికారి శశిధర్ అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన రైతు ఎర్రం సదానందం తన వ్యవసాయ క్షేత్రంలో సాగు చేసిన టమాటా పంటను మండల వ్యవసాయ అధికారి అనూష ఆదేశాల మేరకు మైదంబండ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శశిధర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన టమాటా మొక్కల ఎదుగుదలను పరిశీలించి రైతుకు పలు సూచనలు చేశారు.అనంతరం ఏఈఓ శశిధర్ మాట్లాడుతూ.. కూరగాయ పంటలకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉండటంతో సాగుకు మంచి కాలమని పేర్కొన్నారు.వర్ష భావ పరిస్థితులు లేనందున రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆశించే కూరగాయల సాగు వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా టమాటా వంటి వాణిజ్య కూరగాయల పంటల సాగులో ఆధునిక యాజమాన్య పద్ధతులు,డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) ఉపయోగించడం వల్ల నీటి పొదుపుతో పాటు ఆశించిన దిగుబడులు సాధించవచ్చన్నారు. పంట మార్పిడి పద్ధతుల ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని, చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# తల్లిని కోల్పోయిన చిన్నారులకు అండగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్ల పెల్లి గ్రామంలో తల్లిని కోల్పోయిన చిన్నారులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అండగా నిలిచారు.సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి చిన్నారుల భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటానని భరోసా ఇచ్చారు.అలాగే నీలవేణి,మహాన్విత అనే చిన్నారుల విద్యకు ఆటంకం కలగకుండా వారికి తాటిపల్లి గురుకుల పాఠశాలలో అడ్మిషన్ కల్పించారు. ఇకపై వారిని తన సొంత పిల్లల్లా భావించి చదువు, ఆరోగ్యం, భవిష్యత్తుకు అవసరమైన ప్రతి సహాయం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు దుస్తులు, విద్యా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మూడు రోజుల పాటు ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ప్రారంభం

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మూడు రోజుల వృత్యంతర శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించే శిక్షణలో విద్యార్థుల అభ్యాసన ఫలితాల మెరుగుదల, భాషా–గణిత నైపుణ్యాల పెంపు, ఎఫ్ఎల్ఎన్ అమలుపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జయ సింహా రావు రిసోర్స్ పర్సన్లు, నాగేశ్వర్,మహేష్, గౌతమి, మహిపాల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించే బోధనా విధానాలపై శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ముత్తారం మండల అధ్యక్షుడు,మాజీ ఎంపీటీసీ బండారి సుధాకర్ డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్,మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి గోగుల రాజిరెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షులు మంథని విజయకుమార్ ఆదేశాల మేరకు సోమవారం ముత్తారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బండారి సుధాకర్ ఆ కమిటీకి వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. కేకే కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంప్రదింపుల ప్రక్రియను వేగవంతం చేసి, ఇచ్చిన హామీలను ఆగస్టు 15వ తేదీ లోపు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాలయాపన చేస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# క్రమశిక్షణ, పట్టుదలతోనే విజయాలు

**ప్రజాపక్షం / రామడుగు :** విద్యార్థులు క్రమశిక్షణతోపాటు పట్టుదల ఉంటేనే ఎంచుకున్న లక్ష్యాలను సులభంగా సాధిస్తారని బద్ధకంతో ఏలాంటి విజయాలు పొందలేరని సరస్వతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. వెలిచాల గ్రామానికి చెందిన మీస శ్రీకాంత్ అనే పూర్వ విద్యార్థి ఇటీవల మెడికల్ మేల్ నర్సింగ్ అధికారిగా సెలెక్ట్ అయిన సందర్భంగా సోమవారం శ్రీకాంత్‌ను స్కూల్ కరస్పాండెంట్‌తోపాటు కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తే అధిరోహించవచ్చని సూచించారు. ఇప్పటివరకు తమ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు 50 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలలో చేరి సమాజానికి సేవ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన శీల అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా,అతని స్నేహితులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు.ఇదే గ్రామానికి చెందిన బోయిని సుధాకర్ ఆధ్వర్యంలో మిత్రులంతా కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం రూ. 6,500 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.విపత్కర పరిస్థితుల్లో తోటి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## 35వ వర్షవాస్ పోస్టర్ల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/వాంకిడిః** వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో సోమవారం భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో 35వ వర్షవాస్ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహల్కర్ మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి అశ్విని పౌర్ణిమ వరకు మూడు నెలల పాటు జిల్లాలోని 145 గ్రామాల్లో వర్షవాస్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. బుద్ధ విహారాల్లో ప్రతిరోజూ ధర్మ గ్రంథాల పఠనం, ధమ్మ బోధనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రోషన్ ఉప్రే, దుర్గం శ్యాంరావు, శ్యాంరావు, లహుజీ దుర్గే, రాజేశ్వర్ ఉప్రే, పాండుజీ జాడే తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సివిల్ జడ్జిగా అజయ్ ఉల్లంకు సన్మానం

**ప్రజాపక్షం/సిర్పూర్ టిః** సిర్పూర్ టి జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన అజయ్ ఉల్లం సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందగా సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అజయ్ ఉల్లం నిష్పాక్షికత, నిజాయితీతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారని, నూతన బాధ్యతల్లోనూ న్యాయవ్యవస్థకు మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్, గంటా కళ్యాణ్, దయారాజ్ సింగ్, గణపతి, కిశోర్ కుమార్, సతీష్ కుమార్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి

**ప్రజాపక్షం/దండేపల్లిః** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్ పిలుపునిచ్చారు. దండేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్లతో కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు లాభాలు చేకూరుస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకంలో రాష్ట్రాల వాటాను పెంచి ఆ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని, విద్యుత్ సవరణ చట్టంతో ఉచిత కరెంటును రద్దు చేసి వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే కుట్ర చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న చేపట్టే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, నాయకులు అనసూయ, గంగా, లలిత, లక్ష్మి, దుర్గ, రాజలింగు, లచ్చన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆగస్టు 10 లోగా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి

**ప్రజాపక్షం/వాంకిడిః** కొమురం భీం జిల్లా బంబార గ్రామం వద్ద నేషనల్ హైవేపై ఆగస్టు 10 లోగా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిరె ప్రకాష్ డిమాండ్ చేశారు. బంబారా నుంచి కలెక్టరేట్ వరకు 20 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా బోయిరె ప్రకాష్, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ రోడ్డు దాటే క్రమంలో పాఠశాల విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అండర్ పాస్ బ్రిడ్జి, బస్ షెల్టర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, ప్రమాద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భోగె ఉపేందర్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) నాయకులు దినకర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జాడే కిషోర్, ప్రభాకర్, సత్యనారాయణ, ఉమేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు




## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి



**ప్రజాపక్షం/నస్పూర్ః** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వడాల రాములుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించాలని, బిసి బాలుర, బాలికల హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి, మెస్, కాస్మోటిక్ ఛార్జీలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వర్షిత్ సాయి, ప్రవీణ్, అఖిల్, శివ కేశవ ప్రసాద్, హర్షిత్, ఆఫ్ నాన్ పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



**ప్రజాపక్షం/రెబ్బెనః** ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని అధికారులు సూచించారు. రెబ్బెన మండలంలోని గంగాపూర్ రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కాంటింజెన్సీ ప్రణాళికపై అవగాహన సదస్సు, విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా వర్షపాతం తగ్గడంతో పాటు మధ్యలో పొడి విరామాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకే అధిక నీరు అవసరమయ్యే వరి కాకుండా కందులు, పెసర్లు, మినుములు, జొన్నలు, సజ్జలు, రాగులు, నువ్వులు, వేరుశెనగ వంటి పంటలను వేసి లాభాలు పొందాలని కోరారు. ధృవీకరించిన విత్తనాలు వాడటం, నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. అనంతరం డీపీవో బిక్షపతి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ఫార్మ్ పాండ్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డిపిఓ బిక్షపతి, తహసీల్దార్ సూర్యప్రకాష్, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏఈ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణ ధూమ్‌ధామ్ జిల్లా కళాకారుల బోనాల జాతర




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ ధూంధాం జిల్లా కళాకారుల వేదిక ఆధ్వర్యంలో బ ఓనాల జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు ఆర్టీసీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అష్ట గంగాధర్, కోశాధికారి రాంపూర్ సాయి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. మంగళవారం జిల్లా కళాకారుల ఆధ్వర్యంలో ఓడ్యాట్‌పల్లిలో బోనాల జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 2014 కు ముందు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులందరూ ఏకతాటిపై నిలిచి ఐక్యతను చాటడం కోసమే ఈ బోనాల కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. 2014కు ముందు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులందరూ ఏకతాటిపై నిలిచి ఐక్యతను చాటడం కోసమే ఈ బోనాల కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఉద్యమ కాలంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఉద్యమానికి ఊతమిచ్చిన మహిళా కళాకారులను గౌరవించుకోవటం దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఉపాధ్యక్షులు రేలారే గంగా, గోదావరి మాట్లాడుతూ రేలారే గంగా, గోదావరి , సవిత నేతృత్వంలో మహిళా కళాకారినులందరూ బోనాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. జిల్లా కళాకారులు అమ్మవారికి బోనాలతో పాటు కళాకారుల ఆటపాట కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఈ పేరుగాంచిన కళాకారులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నట్లు తెలిపారు.

## సింగరేణిలో పారదర్శకత, వేగం పెంచాలి

**ప్రజాపక్షం/మందమర్రిః** సింగరేణి సంస్థ పనుల్లో మరింత పారదర్శకత, వేగం పెంచాలని, ఆడిట్ సంబంధిత అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని జనరల్ మేనేజర్ (ఎఫ్ అండ్ ఎ) ఇంటర్నల్ ఆడిట్ చుక్కా మురళీధర్ అధికారులను ఆదేశించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణతో కలసి ఆయన ఇంటర్నల్ ఆడిట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నల్ ఆడిట్ నివేదికలు, ప్రభుత్వ ఆడిట్ గమనింపులు, భూసేకరణ, మైనింగ్ స్టోర్స్ నిర్వహణ అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం చుక్కా మురళీధర్‌ను జీఎం రాధాకృష్ణ, అధికారులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్, ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, కేకే ఏజెంట్ ఖాదిర్, కైరిగూడ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం. నరేందర్, ఎస్ఎస్ఓ వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పోడు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/కెరమెరి :** కెరమెరి మండలంలోని సుర్దాపూర్‌దనోరా గ్రామాల మధ్య పోడు సాగు భూముల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క హామీ ఇచ్చారు. సోమవారం ఆమె బాధిత రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమ్మద్ సుజాయిత్ ఖాన్ మాట్లాడుతూ విత్తనాలు వేసి పంటలు సాగు చేస్తున్నప్పటికీ, కలుపు తీయడం వంటి వ్యవసాయ పనులు చేపట్టడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ రైతులు సాగు పనులు నిరాటంకంగా కొనసాగించేలా అధికారులు సహకరించాలని కోరారు. రైతుల జీవనాధారమైన వ్యవసాయాన్ని పరిగణనలోకి తీసుకుని అధికారులతో చర్చించి చట్టబద్ధమైన పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పోడు రైతులు ఉప్పుల శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి 'సర్' ప్రక్రియ పరిశీలన

**ప్రజాపక్షం/జైనూర్ :** జైనూర్ మండలంలోని పవర్‌గూడా, రావ్‌జీగూడా, పొలాస గ్రామాల్లో సోమవారం జరుగుతున్న ఇంటింటి ఎస్ఐఆర్ ప్రక్రియను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావు, మండల అధ్యక్షుడు షేక్ రషీద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. ప్రజలు అధికారులకు సహకరించి సరైన వివరాలు అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ముఖీద్, సర్పంచ్ తొడసం రాజేందర్, జిల్లా సభ్యులు పేందుర్ ప్రకాష్, బిఎల్ఎ సూపర్‌వైజర్ కొటేష్, మహేముద్ తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పల్లె రాజయ్య

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలంలోని రాంపూర్ గ్రామ కాంగ్రెస్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు అజ్మీరా నందునాయక్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నందునాయక్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా అలుగునూరి పద్మరావు, అధ్యక్షుడిగా పల్లె రాజయ్య, ఉపాధ్యక్షులుగా పాలగాని శ్రీనివాస్, మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా సందినేని శ్రీనివాస్, కార్యదర్శులుగా ఒరగంటి దూబ్బయ్య, కుడిది రవి, కోశాధికారిగా సందినేని నర్సయ్య, అధికార ప్రతినిధులుగా మామిడి రమేష్, పురంశెట్టి రవి, ప్రచార కార్యదర్శిగా ఎమూల లచ్చయ్య ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా చెన్నోడి రమేష్ రావు, నూతి రామయ్య, కల్లెడ నర్సయ్య, సంద సుదర్శన్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మేకల మాణిక్యం, మంద రాజేష్, ముజాఫర్, మచ్చ శంకరయ్య, సాహెల్ షా, దాసరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి సిఎంఆర్ఎఫ్ అందజేత

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** మండలంలోని పల్లికొండ గ్రామానికి చెందిన చిలివేరి నాగేష్ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటుండగా వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించటంతో వైద్య ఖర్చుల కోసం కుటుంబ సభ్యులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించి సిఎం సహాయనిధిని మంజూరు చేయించిన రూ.3 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని బాధిత కుటుంఆనికి అందజేశారు. ఆపదతో తన కుటుంబానికి అంగా నిలిచిన ముత్యాల సునీల్‌కుమార్‌కు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## అర్బన్ పార్కును సందర్శించిన అధికారులు

**ప్రజాపక్షం/మాక్లూర్:** మండలంలోని చిన్నాపూర్ అర్బన్ పార్కును తెలంగాణ అటవీశాఖ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ వినయ్ కుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులు, పచ్చదనం, పరిశుభ్రత, సందర్శకులకు కల్పించిన సౌకర్యాలు, పార్కు నిర్వహణ, పరిసర వాతావరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పార్కుకు వస్తున్న సందర్శకుల స్పందనను గమనించి పార్కు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులను అభినందించారు. పార్కు అభివృద్ధి, నిర్వహణ మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన సూచనలు, సలహాలు కూడ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ అండ్ హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ వినయ్‌కుమార్, ఐఎఫ్ఎస్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ బాసర సర్కిల్ అర్పణ, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్, ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్, ఆర్మూర్ చంద్రశేఖర్‌రావు, ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ నిజామాబాద్ సుధాకర్ జిల్లాలోని అరణ్య పార్కును సందర్శించారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఆరుతడి పంటలపై అవగాహన

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకరావలనే ఉద్దేశ్యంతో సోమవారం చేంగల్ రైతువేదికలో విత్తన మేళా నిర్వహించారు.చేంగల్ గ్రామ వ్యవసాయ విస్తీర్ణాధికారి స్నేహ రైతులకు ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులను వివరించారు. తక్కువ వర్షపాతమున్న పరిస్థితుల్లో ఆరుతడి పంటల సాగు, నాణ్యమైన ధృవీకరించినబడిన విత్తనాల వినియోగం, పంటల ఎంపికపై రైతులకు సూచనలు చేశారు. హార్టికల్చర్ అధికారి రోహిత్ ఉద్యాన పంటల సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. వీడీసీ చైర్మన్ నేతికుంట గంగాధర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ శాఖలు సూచిస్తున్న నాణ్యమైన విత్తనాలనే వినియోగంచే మెరుగైన దిగుబడులు సాధించాలని కోరారు. ఈ విత్తన మేళాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ పంటల విత్తనాలపై వివరాలు తెలుసుకుని సాగు సలహాలను పొందారు. కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

## పాఠశాలలో ఘనంగా నషా ముక్త్ అభియాన్ అవగాహన



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** జెడ్పీ హెచ్ఎస్ చించోలి (బి) పాఠశాలలో నేషనల్ సర్వీస్ స్కీమ్‌కార్యక్రమంలో" భాగంగా నషా ముక్త్ అభియాన్" (మాదకద్రవ్యాల నిర్మూలన)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, ఏజీ కళాశాల (ఆదిలాబాద్)కు చెందిన బీఎస్సీ (అగ్రికల్చర్) నాలుగో సంవత్సరం విద్యార్థినులు సాయి లహరి, ప్రత్యూష, తేజస్విని, శిరీష, అక్షయతో పాటు మండల విద్యాధికారి బి. మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. మునీందర్ రాజు,ఫిజికల్ డైరెక్టర్ కె.అన్నపూర్ణల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, విద్యాభ్యాసంతో పాటు మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.అనంతరం పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించి,నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులందరిచే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ,ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువతను తప్పుడు మార్గంలోకి వెళ్లకుండా కాపాడేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి. వెంకట్




**ప్రజాపక్షం/కెరమెరి:** ఎల్ నినో ప్రభావంతో జూలై, ఆగస్టు నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి. వెంకట్ సూచించారు. సోమవారం కెరమెరిలోని కేస్లాగూడ రైతు వేదికలో ఇన్పుట్ డీలర్లు, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాధార ప్రాంతాల్లో వరి సాగు తగ్గించి కంది, మినుములు, పెసర, జొన్న, సజ్జ, నువ్వులు, పల్లీ వంటి పంటలను సాగు చేయాలని కోరారు. ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరకు ఎరువులు అమ్మినా, నిషేధిత, గడువు ముగిసిన పురుగుమందులు విక్రయించినా డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. అత్యవసర పంటల ప్రణాళికపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి యుగేందర్, ఎంపిడిఒ అంజత్ పాషా, తహసిల్దార్ నాగార్జున, ఎంపీఓ సాయి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ సురేష్, ఎపిఒ మల్లయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు బాలాజీ, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇన్‌పుట్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## ఆలయం పునఃనిర్మాణానికి రూ.50 వేల ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండల కేంద్రంలో స్వయంభువుగా వెలసిన శ్రీ వినాయక ఆలయం శిథిలావస్థకు చేరుకోవటంతో ఆలయ పునఃనిర్మాణానికి రజక సంఘం ఆధ్వర్యంలో చర్యలు ప్రారంభించారు. ఈ పునఃనిర్మాణ కార్యక్రమానికి వివిధ వర్గాల ప్రజలు, దాతలు ముందుకొస్తూ తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా భీమ్‌గల్ మున్నూరుకాపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ పునఃనిర్మాణం కోసం రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు రజక సంఘం సభ్యులకు విరాళం చెక్కును అందించి ఆలయ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తి కావలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి మంచి కార్యక్రమాల్లో మున్నూరుకాపు ఫౌండేషన్ భాగస్వామ్యం అవుతుందన్నారు. రజక సంఘం నాయకులు మున్నూరుకాపు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సమాజంలోని దాతలు, భక్తులు కూడా ఆలయ పునఃనిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నీలం రవితో పాటు నర్సయ్య, తేజ, చరణ్, అరవింద్, నవీన్, ప్రదీప్, సతీష్, విశాల్, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆటో కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యవసరాల పంపిణీ



**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి పట్టణ ఆటో కార్మిక సేవా సమితి రెండవ వార్షికోత్సవం సందర్భంగా నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి చైర్మన్ నేరెళ్ల వెంకటేష్ మాట్లాడుతూ సమితికి సహకరిస్తున్న సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సకినాలు శంకర్, పోలు శ్రీనివాస్, పోతగంటి తిరుపతిలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు అంజి, ప్రభాకర్, శ్రీనివాస్, ఎండి ఇన్నూస్, లక్ష్మీనారాయణ, పిట్టల రవి పాల్గొన్నారు.

## మహిళా సంఘం నూతన పాలకవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని మహిళా సంఘ భవనంలో సోమవారం మోర్తాడ్ మండల కేంద్రంలోని శ్రీ సాయి గ్రామ సంఘం, మహిళా సమాఖ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2025 2026సంవత్సరంలో ఆర్థిక అంశాలు, ఎంటర్ ప్రైజెస్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సిసి తడకల శ్రీనివాస్, మహిళా సంఘ సభ్యులకు సూచించారు. అలాగే నూతన పాలకవర్గాన్ని సైతం ఎన్నుకున్నారు. అధ్యక్షులిగా ఎం.లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా మాధుర్య, కార్యదర్శిగా జి.శ్రావణి, సంయుక్త కార్యదర్శిగా శిరీష, కోశాధికారిగా ఎం.రమ్యలను ఎన్నుకున్నారు. అలాగే మిగతా 9మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ తడకల శ్రీనివాస్, వివో ఏ లావణ్య, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పంటల వైవిధ్యీకరణతోనే రైతులకు లాభం

**ప్రజాపక్షం/మందమర్రి:** ప్రకృతి వైపరీత్యాలు, ఎల్ నినో ప్రభావం వల్ల వచ్చే మార్పులను తట్టుకోవడానికి రైతులు పంటల వైవిధ్యీకరణ చేపట్టాలని మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి ఇ. సురేఖ సూచించారు. మందమర్రి మండల పరిధిలోని సండ్రోనిపల్లి గ్రామ రైతు వేదికలో సోమవారం విత్తనాల మేళా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఇ. సురేఖ మాట్లాడుతూ కేవలం వర్షపాతంపైనే ఆధారపడి చెరువుల కింద వరి సాగు చేయకుండా, తక్కువ నీటితో పండే కంది, మినుములు, పెసర, నువ్వులు, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని కోరారు. తెలంగాణ స్టేట్ సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా కంది, పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువుల యాజమాన్యం, విడతల వారీగా వాడకం, నానో యూరియా, నానో డిఎపి ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువుల డీలర్లు ఎమ్ఆర్పి కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, ఏఈవోలు కనకరాజు, రాజశేఖర్, శంకరపల్లి సర్పంచ్ వెంకటేష్, ఉపసర్పంచ్ మణితేజ, పొన్నారం సర్పంచ్ పెంచాల మధు, గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమికి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/కౌటాల:** కౌటాల మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఈ నెల 29న బుధవారం గురుపౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు సాయిబాబాకు పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టనున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబా కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు

## సమావేశానికి వెళ్లిన హెచ్ఎం మూతపడిన పాఠశాల



**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలం కోలంగూడ (చిచ్చుపల్లి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సోమవారం పని వేళల్లో మూతపడటంతో విద్యార్థులు రోజంతా బయటే గడపాల్సి వచ్చింది. ప్రధానోపాధ్యాయురాలు అధికారిక సమావేశానికి హాజరుకావడంతో బడికి రాలేకపోయారు. పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయురాలు పనిచేస్తుండగా, ఆమె మీటింగ్‌కు వెళ్లిన సమయంలో విద్యార్థుల బోధనకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల మూసివేతపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** నిర్మల్ రూరల్ మండల చిట్యాల్ గ్రామానికి చెందిన బోంపాల రాహుల్ కి అనారోగ్య కారణంగా హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స నిమిత్తం రూ 3.00 లక్షల ఎల్ఓసి చెక్కును సదరు వ్యక్తికి అందజేశారు. నెల రోజుల వ్యవధిలోనే రెండు సార్లు నిమ్స్ లో చికిత్స పొందుతున్న బోంపాల రాహుల్ కు ఎల్ఓసి ద్వారా ఇప్పటివరకు 6.50 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆపదలో ఉన్న తమ కుటుంబానికి అండగా ఉన్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారికి వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సినీ దర్శకుడు వంశీ పైడిపల్లి జన్మదిన వేడుక

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ వాస్తవ్యులు, ప్రముఖ సినీ దర్శకుడు వంశీ పైడిపల్లి జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక తెలంగాణ చౌక్ వద్ద అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి దర్శకుడు వంశీ పైడిపల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అభిమానులు మాట్లాడుతూ, వంశీ పైడిపల్లి తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్నారని, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి తెలుగు సినిమా ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఆయన మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో మరెన్నో విజయవంతమైన చిత్రాలను అందించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో షేక్ జహీరుద్దీన్, బీసీ రమేష్, శెట్టి సతీష్, పడాల పూర్ణచందర్,సతీష్ రావు,గంగాధర్, కొక్కొండ రాజు,కొమిరె సుమన్, కొమురయ్య,రాజలింగం,తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ నీటి పంటలతోనే నష్టాల నివారణ

**ప్రజాపక్షం/పెంబి :** పెంబి లోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు.ఎల్నినో ప్రభావం వల్ల ఈసారి తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని ఏవో నవీన్ నాయక్ సూచించారు.జొన్న,పెసర, మినుములు, కందులు, నువ్వుల విత్తనాలను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో ఏఈఓలు నాగమణి, జగదీష్లతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## రైతు వేదికల్లో విత్తన మేళా

**ప్రజాపక్షం/కుంటాల :** ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలను సాగు చేయడానికి ప్రభుత్వం అందిస్తున్న రైతు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని భైంసా ఏ డి ఏ అసం రవి అన్నారు. సోమవారం కుంటాల రైతు వేదికలో విత్తన మేల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తక్కువ నీటితో ఎక్కువ లాభం పొందే ప్రత్యా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం ఈ విత్తనమేల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ మేళలో విత్తనాలు మినము, పెసర, కంది, నూనెగింజ పంటలు, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/మంచిర్యాల:** ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ ప్రభావాన్ని అధిగమించేందుకు రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. సోమవారం భీమారం మండల కేంద్రంలోని రైతు వేదికను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం బెల్లంపల్లి మండలం గురజాల గ్రామంలో రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ వర్షపాతం నమోదు కావడం, నీటి లభ్యత తగ్గడంతో రైతులు ఆరుతడి, పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి పంటలు వేసుకోవాలని సూచించారు. రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తూ మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. తరువాత బెల్లంపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా సవరణ, సాదాబైనమా, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, తహసిల్దార్ కృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గోడల పంపు గ్రామంలో కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఖానాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగిలి శంకర్ ఆధ్వర్యంలో గోడల పంపు గ్రామ కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా నాగుల శంకర్ గౌడ్,గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా దాతుర్క లక్ష్మీ రాజం, ఉపాధ్యక్షులుగా మాటేరి రాజ్ కుమార్, దూడ శంకర్, ప్రధాన కార్యదర్శిగా అమంద రమణరాజ్, గ్రామ యూత్ అధ్యక్షుడిగా మోలంకాల ఆనంద్, కోశాధికారిగా అమంద సుదర్శన్ ఎన్నికయ్యారు.కార్యదర్శులుగా సింగం రాజారాం,మాసవేణి మల్లేష్, తుదిగేని శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా కట్ల పోషన్న, బీసీ సెల్ అధ్యక్షుడిగా కట్ల నాగేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చిలుముల నరసయ్య, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా మాసవేణి సాయిగౌడ్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పాదం రాజేశ్వర్, మామడ రాజలింగు, బెజ్జారపు కాంతయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా జంగిలి శంకర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆ విశ్వాసాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి అంకం రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ అమంద శ్రీనివాస్,సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజు నాయక్, తర్లపాడు సర్పంచ్ సచిన్, దిల్వార్పూర్ మాజీ సర్పంచ్ తిరుపతి గౌడ్, ఉప సర్పంచ్లు కట్ల మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'సర్' ప్రక్రియలో భాగంగా వివిధ వార్డుల సందర్శన



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ డిసిసి అధ్యక్షులు బొజ్జు పటేల్ ఎంఎల్ఏ ఖానాపూర్, ఆదేశాల మేరకు ఈరోజు నిర్మల్ లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల హరీష్, నాయకత్వంలో సర్ కార్యక్రమంలో భాగంగా గాంధీ నగర్, నాయడివాడ, బంగల్ పేట్,వెంకటాద్రిపేట్, బ్రాహ్మణ పూరి, చింతకుంటావాడ, మదిన కాలనీ వివిధ వార్డులలో పర్యటించడం జరిగింది.ఎస్ ఐ ఆర్ ప్రక్రియను రోజువారీగా పర్యవేక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ లను సూపర్వైజర్ లను ఎప్పటికప్పుడు అడిగి వార్డుల వారీగా నమోదవుతున్న పురోగతిని సమీక్షించి రోజువారీ పట్టణంలో ఉన్న వివిధ బూతులలో చేపట్టిన పనులు వచ్చిన దరఖాస్తులు ఇతర సమస్యలను నివేదిక రూపంలో డిసిసి కార్యాలయానికి సమర్పిస్తానని పట్టణ అధ్యక్షులు ఆకుల హరీష్ తెలియజేయడం జరిగింది.ఇందులో భాగంగా ఇప్పటివరకు జరిగిన పురోగతిని తెలుసుకోవడం జరిగింది.దాదాపు 100% నమోదు కోసం కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ (BLA) లు అందరూ తప్పకుండా ప్రతీ ఇంటికీ వెళ్లి విషయాలు తెలియజేయాలని సూచించారు. కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే సంక్షేమ పథకాలు ఆగిపోకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరూ తప్పకుండా ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అంబడి రాజేశ్వర్,మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లూరి కృష్ణవేణి, జడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారిదశరథ్ రాజేశ్వర్ , SC డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శి కొంతం గణేష్,డీసీసీ జెనరల్ సెక్రటరీ జునైద్ , మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ మతీన్, కిజర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పరిరక్షణకు జైల్ భరో విజయవంతం చేయాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, రోజువారీ వేతనం 800 చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. అలాగే వి.బి.జి. రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఖానాపూర్ మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 2005లో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వామపక్షాల పోరాట ఫలితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించి వికసిత్ భారత్ గ్రామ్ జీ (వి.బి.జి. రాంజీ)గా మార్చడమే కాకుండా, రాష్ట్రాల వాటాను 10 శాతం నుంచి 40 శాతానికి పెంచే విధంగా భారం మోపాలని చూస్తోందని ఆరోపించారు. ఇదే అదునుగా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు వచ్చే నెల 10వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీలు, రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, ఖానాపూర్ మండల అధ్యక్షులు పానగంటి నరేష్ కుమార్, మండల కార్యదర్శి సుంచుల నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు, ఖానాపూర్ మండల ఉపాధ్యక్షులు నాగుల నర్సాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడిని తిరిగి నియమించాలి



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండలం లోని కొరటికల్ ఆశ్రమ ఉన్నత పాఠశాల నుంచి డిప్యూటేషన్పై బదిలీ అయిన పిజి హెచ్ఎం కాత్లే గంగారాంను తిరిగి అదే పాఠశాలలో నియమించాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ పీవోకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం విధులు చేపట్టినప్పటి నుంచి ఆయన పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన పర్యవేక్షణలోనే మార్చి నెలలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆయనను మేడిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు డిప్యూటేషన్ పంపడం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆయన డిప్యూటేషన్ను రద్దు చేసి కొరటికల్ పాఠశాలలోనే కొనసాగించాలని గ్రామ పటేల్, ప్రజాప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ సిడం జనార్ధన్, సెడ్మకి మాణిక్ రావు, గ్రామ సర్పంచ్ ఆత్రం భీమ్ రావు, ఆత్రం నాగేష్, మాజీ ఎంపిటీసీ ఆత్రం సుగుణ, కొరటికల్ (కే) గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'కార్గిల్ విజయ్ దివస్' వేడుకలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సిసి విభాగం ఆధ్వర్యంలో జులై 27న కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన అపూర్వ ధైర్యసాహసాలు, త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అమర వీరులను స్మరించుకోవడం, వారి త్యాగాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కార్గిల్ విజయ్ దివస్ విశిష్టతపై ఉపన్యాసాలు ఇచ్చారు. దేశభక్తి గేయాలు, నృత్య ప్రదర్శనల ద్వారా కార్గిల్ యుద్ధంలో భారత వీర జవాన్లు చూపిన సాహస గాథలను కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డా. యు. గంగాధర్, ఏ.ఓ. నాగ శ్రీనివాస్, ఎన్సీసీ అధికారి డా. బి. ఉమేష్, డా. కె. సూర్యసాగర్, డా. పి.జి. రెడ్డి, డా. టి. శ్రీనివాస్, డా. ఎం. రజిత, సయ్యద్ హసీబుర్ రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల ఉత్సాహపూరిత భాగస్వామ్యంతో ఈ వేడుకలు పూర్తి దేశభక్తి వాతావరణంలో విజయవంతంగా ముగిసాయి.

## 'చలో హైదరాబాద్' మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నేరడిగొండ:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఆగస్టు 1న నిర్వహించనున్న "చలో హైదరాబాద్మహాధర్నా" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు జాధవ్ రాజునాయక్ పిలుపునిచ్చారు. లకంపూర్ ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు)లో సోమవారం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన ధర్నా పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల సాధనకై సంఘం తలపెట్టిన ఈ మహాధర్నాలో ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని, తమ హక్కుల సాధనకై పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అర్క మధుకర్, వీరమల్ల రాజేశ్వర్, గెడం జ్యోతిరామ్, గంగాభవాని, ప్రేమ్దాస్, కమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైకి సన్మానం

**ప్రజాపక్షం /కుంటాల :** మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో నూతన ఎస్సై జి.నరేష్ ను బి ఆర్ ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి ఆధ్వర్యంలో పలువురు నాయకులు సన్మానించారు. దౌనెల్లీ సర్పంచ్ రాజు,వీడీసీ లక్ష్మణ్,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోశెట్టి, మాజీ ఉప సర్పంచ్ రమేష్,బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుదర్శన్,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.